ప్రజాశక్తి

ఆదివారం 26 ఫిబ్రవరి 2023



అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం : అగ్నివీర్ ఉద్యోగాలకు అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను విశాఖలోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం వారు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ ఉద్యోగాలకు టెన్త్ విద్యార్హత కలిగి ఉండాలని, అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ ఉద్యోగం కోసం 8వ తరగతి విద్యార్హత ఉండాలని సూచించారు. అర్హత గల అభ్యర్థులు ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్ (www.joinindianarmy.nic.in)లో మార్చి 15 వరకు దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ నియామకం ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందన్నారు. మొదటి దశలో ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష ఏప్రిల్ 17 నుండి మే 4 వరకు ఉంటుందన్నారు. ఇందులో అర్హత సాధించిన అభ్యర్థులను రెండో పరీక్షలో షార్ట్‌లిస్ట్ చేసి ర్యాలీ నిర్వహిస్తారన్నారు.

నగరంలో ఒక పోలీస్ కానిస్టేబుల్ తన కుమార్తె వివాహం కోసం ఎపిజిఎల్ఐ రుణం కోసం దరఖాస్తు పెట్టుకొని రెండేళ్లు గడిచిపోయాయి. నేటికీ ఆ డబ్బులు ఎపిజిఎల్ఐ నుంచి మంజూరు కాలేదు. ఆ డబ్బులు వచ్చాక తిరిగి చెల్లించొచ్చని వడ్డీకి రూ.6 లక్షలు తీసుకున్నారు. ఎపిజిఎల్ఐ డబ్బులు రాకపోవడంతో రెండేళ్లుగా వడ్డీ కడుతూనే ఉన్నారు.

నగరంలోని రెవెన్యూ కాలనీకి చెందిన కలెక్టరేట్ ఉద్యోగి ఇంటి నిర్మాణానికి రుణం కోసం ఎపిజిఎల్ఐకి దరఖాస్తు చేసుకున్నారు. 14 నెలలు గడిచినా డబ్బులు రాలేదు. దీంతో ఇంటి నిర్మాణం మధ్యలో ఆగి పోయింది.

ఎపిజిఎల్ఐ కార్యాలయం

- గగనంగా మారిన ఎపిజిఎల్ఐ డబ్బులు
- రెండేళ్లుగా ఉద్యోగుల ఎదురుచూపులు
- విశ్రాంత ఉద్యోగులకు చెల్లించని ప్రభుత్వం

ప్రభుత్వ జీవిత బీమా..

ఇదేం పద్ధతమ్మా...?

ఇలా అవసరాలకు ఆదుకోవాల్సిన ఎపిజిఎల్ఐ డబ్బులు ఉపయోగ పడకపోగా, అది మరింత కష్టాలను తెచ్చిపెడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎపిజిఎల్ఐ ద్వారా ఉద్యోగులకు భరోసా కల్పించాల్సిన స్థితి నుంచి ఆ డబ్బులు ఎప్పుడు వస్తాయా? అని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సిన దుస్థితి నేడు నెలకొంది. అవసరాల కోసం దాచుకున్న డబ్బులు ప్రస్తుతం ఉపయోగపడక పోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సుమారుగా 25 వేల మందికి పైగా ఉన్నారు. వీరందరి భద్రత కోసం డబ్బులను ప్రయివేటు ఇన్స్యూరెన్స్ కంపెనీల కంటే ప్రభుత్వ సంస్థ అయిన ఎపిజిఎల్ఐలో డబ్బులు కట్టుకుంటే భద్రతతోపాటు అవసరాలకు ఉపయోగ పడుతుందని నమ్మకముంది. అందుకే ఎపిజిఎల్ఐలో ఉద్యోగ, ఉపాధ్యాయులు డబ్బులు దాచుకుంటున్నారు. అవసరాలు కోసం, ప్రయివేటు సంస్థల కంటే అధికంగా వడ్డీతో పాటు భద్రత ఉంటుందని భావించిన డబ్బులు నేడు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానంగా ఎపిజిఎల్ఐ ద్వారా రుణాలు పొందే అవకాశముంది. సర్వీసులో రిటైరవ్వడానికి ముందు క్లయిములు చెల్లించాలి. వీటితోపాటు రిటైరైన వారికి వారి బాండ్ల ఆధారంగా డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఈ మూడు రకాల చెల్లింపులు రెండేళ్లుగా నిలిచిపోయాయి. వీటి కోసం ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కూడా కలెక్టరేట్, మండల కార్యాలయాల వద్ద నిరసనలు చేసి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఎపిజిఎల్ఐ ద్వారా చెల్లించాల్సిన డబ్బులు నేటికీ ఇవ్వకపోవడంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డబ్బులు తమకు ఇవ్వకపోవడం అన్యాయమని, ఇదే పరిస్థితి కొనసాగితే ఆందోళన బాట తప్పదని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం ఈ బకాయిలు ఎప్పటికీ చెల్లిస్తుందో వేచి చూడాల్సిందే.



ఎపిజిఎల్ఐ నుంచి డబ్బులు రావాల్సిన విశ్రాంత ఉద్యోగులు

రూ.12.45 కోట్ల క్లయిములు పెండింగ్

జిల్లాలో ఎపిజిఎల్ఐ నుంచి 490 మంది ఉద్యోగులకు రూ.12,45,49,002 చెల్లించాల్సి ఉంది. ఉద్యోగులు బాండ్ల సమయం ముగిసినా గత రెండేళ్లుగా చెల్లించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం క్లయిమ్ పెండింగ్ అమౌంట్ చెల్లించాలని వారు కోరుతున్నారు.

రూ.2.49 కోట్ల రుణాలు

జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 226 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు వివిధ అవసరాల కోసం ఎపిజిఎల్ఐ రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. రుణానికి దరఖాస్తు చేసుకుంటే నెలన్నర రోజుల్లో రావాల్సిన డబ్బులు ఏళ్ల తరబడి మంజూరు కాకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

విశ్రాంత ఉద్యోగులకు రూ.88 లక్షలు

జిల్లాలో గత రెండేళ్లలో 42 మంది ఉద్యోగులు వివిధ శాఖల్లో ఉద్యోగ విరమణ పొందారు. వీరికి రూ.88,80,903 చెల్లించాల్సి ఉంది.వాస్తవానికి ఉద్యోగి రిటైర్ కావడానికి రెండేళ్ల ముందు నుంచి వారికున్న బాండ్లను బట్టి డబ్బులు చెల్లించాల్సి ఉంది. అయినా ఎపిజిఎల్ఐ డబ్బులు చెల్లించకపోవడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సరాసరి వేతనం అందుకోవాలి

వేతనదారులకు కలెక్టర్ సూచన

ప్రజాశక్తి - పాలకొండరూరల్

ఉపాధి హామీ పథకంలో సరాసరి వేతనాన్ని ప్రతి వేతనదారుడు అందుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని అట్టలి గ్రామ పంచాయతీ పరిధిలో గల పనుకు చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. వేతనదారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. వేతనం ఎంత వస్తుందని ఆరా తీయగా సరాసరి రూ.229 వస్తుందని వేతనదారులు తెలియజేశారు. సరాసరి వేతనం రూ.257 రావాలని అందుకు తగిన ప్రయత్నం చేయాలని కలెక్టర్ సూచించారు. చిన్న గ్రూపులుగా ఏర్పడి పనులు చేయడం వల్ల పనిలో నాణ్యత, వేగం పెరుగుతుందని, అప్పగించిన పని సకాలంలో పూర్తి చేయగలరని చెప్పారు. ఎక్కువ వేతనం సంపాదించాలని తద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగవుతాయని సూచించారు. బయట పనులకు వెళ్లడం వల్ల వచ్చే వేతనానికి, ఉపాధి హామీ పనులకు వచ్చే వేతనానికి వ్యత్యాసం ఉందా అని ప్రశ్నించగా చాలా వ్యత్యాసం ఉంటుందని వేతనదారులు తెలిపారు. సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తున్నారని, వాటిపై మరింత శ్రద్ధ పెట్టడం వల్ల ఎంతో ఉపయోగం, సంతృప్తి లభిస్తుందని ఆయన చెప్పారు. పనులకు మార్కింగ్ పక్కాగా ఇవ్వాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. వేతనాల గురించి ఆరా తీయగా గత వారం వేతనాలు రావాల్సి ఉందని వేతనదారులు తెలిపారు.

వేతనదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి....

వేసవి తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ వేతనదారులు తగు సూచనలు, సలహాలు పాటించాలని కలెక్టర్ కోరారు. ఉపాధి హామీ సిబ్బంది వేతనదారులకు సరైన మార్గదర్శకత్వం వహించాలని ఆదేశించారు. సూచించిన సమయాల్లో పనులు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక చికిత్స కిట్లు, తాగు నీరు అందుబాటులో ఉంచాలని, నీడ ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఉపాధి హామీ సిబ్బదిని ఆదేశించారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, తప్పని సరి పరిస్థితుల్లో బయటకు వెళ్తే అన్ని జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఉపాధిహామీ వివరాలను కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డి.త్రినాధులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని మామిడిపల్లి జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా ఒడిశా లోని జైపూర్ పట్టణానికి చెందిన షేక్ ముస్తాక్ (24) వద్ద ఐదు కిలోల గంజాయిని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు శనివారం కేసు వివరాలను విలేకరులకు తెలిపారు. శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా అతని వద్ద ఉన్న బ్యాగులో గంజాయి వుందనే అనుమానంతో తనిఖీ చేయగా నిర్ధారణ అయింది. దీంతో షేక్ ముస్తాక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ ఎస్ఐ వి.పాపారావు తెలిపారు. టౌన్ ఇంఛార్జి సిఐ ఎస్.ధనుంజయరావు కేసు దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. విలేకరుల సమావేశంలో టౌన్ ఎస్ఐ నారాయణరావు ఉన్నారు.

గంజాయిని తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన నిందితుడు

జిసిసి గోదాంను పరిశీలిస్తున్న డిఎం మహేంద్రకుమార్

సంక్షేమ హాస్టళ్లకు నాణ్యమైన సరుకుల పంపిణీ

జిసిసి గోదామును పరిశీలించిన డిఎం

ప్రజాశక్తి - సాలూరు

జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు నాణ్యమైన నిత్యావసర వస్తువుల సరఫరాకు చర్యలు చేపడుతున్నట్లు జిసిసి డిఎం వి.మహేంద్రకుమార్ చెప్పారు. శనివారం ఆయన స్థానిక జిసిసి గోదామును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో 11,300 క్వింటాళ్ల చింతపండు కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. 26 కొనుగోలు కేంద్రాల్లో చింతపండు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. గిరిజనులు నాణ్యమైన చింతపండును తీసుకుని రావాలని కోరారు. రూ.4.26 కోట్ల చిన్నతరహా అటవీ ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. డివిజన్‌లో అన్నిరకాల వ్యాపార లావాదేవీల ద్వారా రూ.59.85కోట్ల లక్ష్యాలను సాధించడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కొమరాడ, పార్వతీపురంలో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు యోచన చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం స్థలం పరిశీలన జరిగిందని చెప్పారు. కురుపాంలో గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటుకు ప్రతిపాదన ఉందన్నారు. ఆయన వెంట గోదాం ఇన్‌ఛార్జి రమణారావు ఉన్నారు.

27, 28 తేదీల్లో ఆధార్ అప్‌డేట్ శిబిరాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆధార్ కార్డులో వివరాలు అప్‌డేట్ చేసేందుకు ఈనెల 27,28 తేదీల్లో రెండు రోజుల పాటు ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. అప్ డేషన్ క్యాంపులను 41 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా వినియోగించుకొని ఆధార్ కార్డును అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డులో తమ వివరాలను కనీసం 10 సంవత్సరాలకు ఒకసారి అప్డేట్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. తమ గుర్తింపు, చిరునామా, ఫోన్ నెంబర్ మార్పుల వివరాలను ఆధార్ కార్డులో అప్డేట్ చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేకంగా ఆధార్ అప్డేషన్ క్యాంపులను ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

మండలాల వారీగా గ్రామసచివాలయాలు

భామిని :	బత్తిలి-2, భామిని, ఘనసార
గుమ్మలక్ష్మీపురం :	బాలేసు, ఇరిడి
జియ్యమ్మవలస :	బి.జె.పురం, జిటివాడ, గవరంపేట, తురకనాయుడువలస
కురుపాం :	మొండెంకల్లు, రస్తాకుంటుబాయి, పెదగొత్తిలి
పాలకొండ :	ఎం.సింగుపురం, నీలం కాలనీ
సీతంపేట :	ధారపాడు-ఆర్, సీతంపేట 01
వీరఘట్టం :	పనస నందివాడ, వండువ-ఆర్, వీరఘట్టం1, వీరఘట్టం3
బలిజిపేట :	అరసాడ, వంతరాం,
గరుగుబిల్లి :	గరుగుబెల్లి, రావివలస, ఉల్లిబద్ర
మక్కువ :	మార్కొండపుట్టి, శంబర, మక్కువ- 1
పాచిపెంట :	పద్మాపురం, పాంచాలి
పార్వతీపురం :	డోకిశీల, జగన్నాధపురం 01, మేదరవీధి-01, కొత్తబెలగం-01
సాలూరు :	మామిడిపల్లి, పెదపాదం, రామాకాలనీ,
సీతానగరం :	అంటిపేట, బూర్జ, జోగింపేట
కొమరాడ :	మాదలింగి

నిర్మాణాల్లో నాణ్యతా లోపం ఉండకూడదు : పిఒ

ప్రజాశక్తి - కురుపాం

పనుల నిర్మాణాల్లో నాణ్యతా లోపాలుంటే ఉపేక్షించేది లేదని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. మండలంలోని గిరిశిఖర గ్రామమైన జరడ గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. అక్కడ సిసి రహదారులు, కాలువ నిర్మాణాలు, రక్షణ గోడల పనులను తనిఖీ చేశారు. అనంతరం మొండంఖల్ లో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా లోపం ఎక్కడా ఉండరాదన్నారు. అన్ని గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు ఉండాలని ఆదేశించారు. అనంతరం మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రభుత్వ ఆదేశాల మేరకు ముఖ హాజరు తప్పనిసరిగా ఉండాలని పిహెచ్‌సి సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసి రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించి సక్రమంగా చూసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

జరడలో రక్షణ గోడ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పిఒ విష్ణు చరణ్

పాపయ్య చెరువులో పనులు చేస్తున్న కూలీలు

తాగునీరు... నిలువ నీడ లేదు

అన్నీ కోతలేనంటూ కూలీల ఆగ్రహం

ప్రజాశక్తి - మక్కువ

కేంద్రప్రభుత్వ నూతన విధానాల వల్ల ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు అవస్థలు పడుతున్నారు. పనిచేసే ప్రాంతంలో కనీస అవసరాలైన నీరు, నీడ లేకపోవడంతో మండలంలోని వెంకటబైరిపురంలోని పాపచెరువులో పనిచేస్తున్న వేతనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఉదయం, సాయంత్రం రెండు పూటలా పనులు చేయాలంటూ హుకుం జారీ చేయడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం వేతనాలు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టకపోడంతో అవస్థలు పాలు చేయడం ఎంత వరకు సమంజసమని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పనిచేసే ప్రాంతంలో తాగునీరు, మజ్జిగ నీడనిచ్చేందుకు టెంట్లు ఉండేవని, అలాగే అదనంగా వేసవిలో 20శాతం వేతనం అందేదని, ప్రస్తుతం వాటిని తొలగించడం అన్యాయమని కూలీలు వాపోతున్నారు. ఆన్లైన్ ప్రక్రియ ద్వారా నమోదు కావడం వల్ల సకాలంలో పని ప్రదేశానికి చేరుకోకుంటే ఆరోజు నమోదు లేకుండా పోతుందని దీంతో ఆ రోజు పని లేక పస్తులుండాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వేసవి సమయంలో రెండు పూటలా పనులను సడలించాలని, అలాగే పనిచేసే ప్రాంతాల్లో కనీస ఏర్పాట్లు చేయాలని కూలీలు కోరుతున్నారు

టీకాలపై అవగాహన అవసరం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన ఎంతో అవసరమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు ప్రజలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధి కూరాకుల వీధిలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. గర్భం దాల్చినప్పటి నుంచి వ్యాధి నిరోధక టీకాలతో పాటు పౌష్టికాహారం కూడా తీసుకోవాలని సూచించారు. అలాగే మూడేళ్లలోపు గల పిల్లలకు కూడా వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. ఎంసిపి కార్డులను తనిఖీ చేసి ఎప్పుడు టీకాలు వేసుకున్నారు ఎవరు వేశారని గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. ఎఐఎఫ్ఐ నిరోధక కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యాధి నిరోధిక టీకాలు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి కార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతులుంటే వారికి సరైన పౌష్టికాహారం అందించాలని కార్యకర్తలను ఆదేశించారు. టీకాలు వేసినప్పుడు ఎంసిపి కార్డులు తప్పనిసరిగా వివరాలు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి, హెల్త్ విజిటర్ ఒ.శాంతి కుమారి, ఎఎన్ఎం రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి కావ్య, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలగవాడలో సర్వేను పరిశీలించిన డిఎంహెచ్ఒ

పాలకొండ : మండలంలోని వెలగవాడలో ఇంటింటా వైద్యసేవలపై జరుగుతున్న సర్వేను శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇంట్లో ఎంతమంది ఉన్నారు, ఎవరికి ఎటువంటి సమస్యలున్నాయో గుర్తించాలన్నారు. ఈ సర్వేలో ఎవరూ తప్పిపోకుండా చూడాలన్నారు. సర్వే బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఎక్కడా లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు.

పాలకొండ : వెలగవాడలో సర్వేను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు

పవరూ లేదు... పైసలూ లేవు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పేరుకే సర్పంచులం... పవరూ లేదు... పైసలు అంతకన్నా లేవు. ఇదీ ఉమ్మడి జిల్లాలో సర్పంచుల ఆవేదన. ఎన్నికైతే మాత్రం గ్రామాలను ఏమైనా అభివృద్ధి చేశారా? ఇదీ పబ్లిక్ టాక్. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో వ్యథ. కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన సర్పంచులు విధులు తప్ప, అధికారానికి, ఆర్థిక స్వావలంబనకు నోచుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వమూ నోరు మెదపకపోవడంతో సర్పంచుల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా మారింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సరిగ్గా రెండేళ్ల క్రితం మూడు దఫాలుగా గ్రామ సర్పంచ్ ఎన్నికలు జరిగిన విషయం విదితమే. వారికి పదవులైతే వచ్చాయి గానీ అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు రావడం లేదు. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థతో మరికొంచెం పట్టుకోల్పోవాల్సిన దుస్థితి దాపురించింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధుల్లో కోత విధిస్తోంది. ప్రజల నుంచి వివిధ రూపాల్లో పన్నులు వసూలు చేస్తున్న కేంద్రం రాజ్యాంగం ప్రకారం నిధులను కేటాయించాల్సి ఉంది. పంచాయతీలకు సగటు మనిషికి రూ.8 చొప్పున, మండల, జిల్లా పరిషత్తులకు రూ.4 చొప్పున కేటాయించాలి. ఈ లెక్కన ఉమ్మడి విజయనగరం జిల్లాకు 2022-23 ఆర్థిక సంఘానికి సంబంధించి మండల, జిల్లా పరిషత్తులకు 15 శాతం చొప్పున రూ.40 కోట్లు, గ్రామ పంచాయతీలకు 70 శాతం చొప్పున సుమారు రూ.93 కోట్ల మేర రావాలి. ఏటా ఇలా వస్తున్న నిధులతోనే తాగునీటి పథకాలు, పారిశుధ్య నిర్వహణ, వాటిలో పనిచేస్తున్న సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ ఛార్జీలు, గ్రామాల్లోని ఇతర సమస్యలు పరిష్కరించేవారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఆర్థిక సంఘం నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో స్థానిక సంస్థలన్నీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లుగా మూడు నెలల నుంచి, ఆరు నెలల బకాయి కొనసాగించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో నెలలో ముగియనున్నప్పటికీ పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన సర్పంచులతోపాటు ఎంపిటిసి సభ్యులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల కనీస అవసరాలు తీర్చలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇటు ప్రజలు అటు పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్యం, వాటర్‌వర్కు తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యుత్తు బకాయిలూ సకాలంలో తీర్చలేకపోవడంతో అధికారులు తీవ్ర ఒత్తిడికి గురి కావాల్సి వస్తోంది. మరోవైపు కరోనా కారణంగా 2020 నుంచి రిజిస్ట్రేషన్లు, దుకాణాల అద్దెలు వంటివి అమాంతంగా తగ్గిపోవడంతో స్థానిక సంస్థలకు రావాల్సిన ఆదాయం తగ్గింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నప్పటికీ ఒకే దేశం, ఒకే పన్ను అంటూ ప్రజలపై వివిధ రూపాల్లో రకరకాల పన్నులు మోపేందుకు, ధరల పెంపునకు మాత్రం కేంద్రం వెనుకాడటం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ఎమ్‌పి, ఎమ్మెల్యే వంటి ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ ముఖ్య నాయకులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా పరస్పర రాజకీయ విమర్శలు, విన్యాసాలు మినహా ప్రజల సమస్యలు గానీ, కేంద్రం చూపుతున్న వివక్ష గానీ పట్టడం అధికార ప్రతిపక్షాలకు పట్టడం లేదు.



విద్యుత్తు ఛార్జీల చెల్లింపునకు పంచాయతీలు కటకటలాడుతున్నాయి. గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించలేని దుస్థితి దాపురిస్తోంది. తాగునీటి పథకాల నిర్వహణ, నీటి సరఫరా బహు భారంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఇలా ఒకటేమిటి కేంద్ర ప్రభుత్వ వైఖరితో స్థానిక సంస్థల మనుగడ దినదిన గండంగా మారింది. పాలకులు మాత్రం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదు. అభివృద్ధి అనే మాటను పూర్తిగా పక్కనబెట్టేసి సాధారణ నిధులతోనే కాలక్షేపం చేస్తున్నారు. గ్రామ స్థాయిలో సర్పంచులు మాత్రం ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. పాలకుల వైఖరిపై సర్పంచులు, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రనిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొంతమందిలో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకుంటున్నాయి. ఇటువంటి తరుణంలో కేంద్రాన్ని నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కూడా మెతకవైఖరి ప్రదర్శిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొమరాడలో ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు కోరుతూ ప్రచారం

కొమరాడ : పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కె.రామ్‌ప్రభను శాసనమండలి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు మధ్యాహ్నం కొమరాడలో శనివారం సిఐటియు, గిరిజన సంఘం, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. నాయకులు కొల్లి సాంబమూర్తి, ఎ.ఓ.సుందర్, శివన్నారాయుడు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల, రైతుల, వ్యవసాయ కూలీల, వివిధ తరగతుల ప్రజల సమస్యలపై నిరంతరం గళం విప్పేది ఒక పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని అన్నారు. కావున పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.రామ్‌ప్రభను అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని పాపంపేట, కొట్టు గుమ్మడ గ్రామాల్లో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు ఎ.మానస, పి.ఉమామహేశ్వరి గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు మధుమేహ రక్తపోటు వంటి వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ నవీనమ్మ, టెక్నీషియన్ దినేష్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ రమణ

మధ్యాహ్న భోజనం పరిశీలన

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట, అంటిపేట ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి డివి రమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయుల లెర్నింగ్ లేసన్, టీచింగ్ డైరీలు, రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు ఇచ్చిన హోంవర్క్, నోట్ బుక్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఇఒ జి.సూరిదేముడు, ఎపిఒ హరికృష్ణ, కోఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న టిడిపి నాయకులు ఉదయభాను

ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలి

సీతానగరం : ఉపాధి కూలీలకు ప్రభుత్వం పనిముట్లు అందజేయాలని టిడిపి నాయకులు గర్భాపు ఉదయభాను అన్నారు. మండలంలోని కోటసీతారాంపురం, వెన్నెలబుచ్చింపేట, వెంకటాపురంలో ఉపాధి హామీ వేతనదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టం ప్రకారం వేతనదారులకు గిట్టుబాటు కూలి ఇవ్వాలని, పనిచేసే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, వేతనదారులకు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు టిడిపి మండల నాయకులు పాల్గొన్నారు.

రాకేష్ తల్లిదండ్రులను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

మృతుడి కుటుంబానికి పరామర్శ

భామిని : రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మరణించిన ఈతమానుగూడకు ఆరిక రాకేష్ కుటుంబాన్ని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని అడిగి కుటుంబం సభ్యులను అడిగి, వారిని ఓదార్చారు. ఈ ప్రమాదం జరిగి ఇద్దరు యువకులు మృతి చెందడం బాధాకరమన్నారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, టిడిపి కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం సురక్షితం

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం సురక్షితమని జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి కె.విజయగౌరి అన్నారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో శనివారం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, జోనల్ స్థాయి టీమ్ ఇండికేటర్లకు సాంకేతిక సమస్యపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రక్తహీనత గల గర్భిణులను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు నూరు శాతం ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సరైన పోషకాహారంలేక బరువు తక్కువ, పెరుగుదలలేని పిల్లల సంరక్షణ వారి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరించారు. కాన్పు అయిన గంటలో పుట్టిన పిల్లలకు తల్లి పాలు ఇవ్వడం వల్ల పిల్లలకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలలో ఉన్న పోషక విలువలు ఇతర పదార్థాల్లో ఉండవని పేర్కొన్నారు. గర్భిణులు కాన్పు అయ్యే వరకు బలమైన ఆహారం తీసుకుంటూ డాక్టర్ సూచించిన మందులు వాడాలని సూచించారు. జోనల్ బృందం సభ్యులు కె.సుబ్రహ్మణ్యం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతిలో పాల్గొన్న సిడిపిఒలు, సూపర్‌వైజర్లు

తాగునీటి సమస్యలపై కంట్రోల్ రూమ్

1 నుంచి అందుబాటులోకి

ప్రజాశక్తి - కలెక్టరేట్

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ కంట్రోల్ రూం మార్చి 1నుంచి ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పనిచేయనుందని పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా తాగు నీటి సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. తాగునీటి సమస్యపై ఫిర్యాదుల స్వీకరించడానికి సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. తాగునీటి సమస్యలు, అతిసార తదితర అంశాలను కంట్రోల్ రూంకు తెలియజేయవచ్చని ఆ ప్రకటనలో సూచించారు.

కంట్రోల్ రూంలో అందుబాటులో ఉండే సిబ్బంది వివరాలు

ఉదయం 6 నుండి 10 గంటల వరకు
జి.అనూష (ట్రైపిస్టు) 9618477479,
ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు
పి.వసంత్ కుమార్ (ట్రైపిస్టు) 8500895315,
మధ్యాహ్నం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు
ఎస్.శ్రీనివాసరావు (సీనియర్ అసిస్టెంట్) 9493822074

27న మున్సిపల్ సమావేశం

సాలూరు : ఈనెల 27న మున్సిపల్ సాధారణ సమావేశం జరుగనుంది. చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలని కమిషనర్ శంకరరావు ఒక ప్రకటనలో కోరారు.

స్వయం సంఘ గ్రూపులతో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పిడీ కిరణ్‌కుమార్

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో ప్రతి సభ్యురాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్.కుమార్ స్వయంశక్తి సంఘాల సభ్యులకు సూచించారు. ఈ మేరకు శనివారం మండలంలోని మహదేవివలసలో మదర్ తెరిస్ స్వయం శక్తి సంఘంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణం క్రమంగా చెల్లించడంతోపాటు జీవనోపాధి మెరుగుపర్చుకోవాలన్నారు. అలాగే మార్చి 8న మహిళా దినోత్సవ సందర్భంగా మహిళ మార్ట్స్ ఏర్పాటు చేయనున్నామని, దీనికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం జి.శివున్నాయుడు, మదర్ తెరిస సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి - కురుపాం

మలేరియా నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా గ్రామాల్లో దోమతెరల వాడకంపై అవగాహన కల్పిస్తున్నట్టు జిల్లా మలేరియా నివారణ అధికారి శ్యామ్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మలేరియా రోగుల వివరాలు, వార్డుల్లో ఆ రోగులకు అందుతున్న వైద్య సేవలను రోగులనే అడిగి తెలుసు కున్నారు. అనంతరం బ్లడ్ బ్యాంక్, ఐసిటిసిను పరిశీలించి ఆసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ శోభారాణిని వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం కురుపాం, శివన్నపేట సబ్ సెంటర్లను సందర్శించి ఇమ్యూనైజేషన్ల రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ గంటా వెంకటరమణ, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా నివారణ అధికారి శ్యామ్‌కుమార్

నిబంధనలు తప్పనిసరి : డిఐఒ

ప్రజాశక్తి - సీతానగరం

సార్వత్రిక టీకా కార్యక్రమంలో నిర్దేశించిన నిబంధనలను వైద్య సిబ్బంది తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. మండలంలోని చినబోగిలి, కోటసీతారాంపురం గ్రామాలను సందర్శించి చిన్న పిల్లల టీకా నిర్వహణను, నిబంధలను ఏ మేరకు అనుసరిస్తున్నారు, గృహ సందర్శనలు చేసి చిన్నారులకు సకాలంలో టీకా వేయబడినదీ అన్న అంశాలను పరిశీలించారు. వ్యాక్సిన్ క్యారియర్‌లో ఇస్ ప్యాక్ స్థితి, వ్యాక్సిన్ వయల్స్‌పై ఉపయోగించే సమయం, తేదీ, ఓపెన్ వయల్‌పాలసీ, అత్యవసర మందుల కిట్, హబ్ కట్టర్, టీకా అర్హుల జాబితా, కార్డులో నమోదు తేదీలు తదితరమైనవి టీకా కేంద్రంలో పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ప్రతి బుధ, శనివారాల్లో నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాల్లో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. చినబోగిలిలో ఇటుక బట్టీ నిర్వాసితులను డిఐఒ సందర్శించి అర్హులైన పిల్లలందరికీ సిబ్బంది టీకా వేశారు. అక్కడ పిల్లల ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. అలాగే గ్రామ పరిసరాల్లో సంచార, వలస కార్మికుల నిర్వాసితులను గుర్తించి అర్హులైన పిల్లలకు టీకా వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం గృహ సందర్శనలు చేసి పిల్లల టీకా కార్డులను పరిశీలించి టీకాలపైనా, చిన్నారుల్లో సాధారణంగా వచ్చే వ్యాధులపైనా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. టీకాల నిర్వహణను మరింత బలోపేతం చేసేందుకు వైద్యారోగ్య సూచనల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో హెల్త్ ప్రోగ్రాం అధికారులు పర్యవేక్షించాలని డిఐఒ జగన్మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.ఆషాలత, సూపర్ వైజర్ భవాని, జయ గౌడ్ , వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామప్పలనాయుడు

సింగిల్ అజెండాతో ముగిసిన సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సింగిల్ అజెండాతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ముగిసింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అజెండాలో పొందు పర్చిన ఒకే ఒక్క అంశాన్ని మున్సిపల్ అధికారి చదివి వినిపించి, కౌన్సిల్ సభ్యులు ఆమోదించడం తో సమావేశం కొద్ది క్షణాల్లోనే ముగిసింది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ జె.రామప్పల నాయుడు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కావడంతో ఈనెల జరగాల్సిన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో పొందుపర్చిన అజెండాలో అభివృద్ధి పనుల ఊసే లేదన్నారు. చర్చలకు తావు లేకుండా పట్టణంలోని 15 సచివాలయాల పరిధిలో గల 10 గార్బేజ్ వాహనాల నిర్వహణ ఖర్చుల నిమిత్తం సంబంధిత కాంట్రాక్టర్‌కు చెల్లించేందుకు కౌన్సిల్ సభ్యుల ఆమోదం పొందేందుకు మాత్రమే ఈ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కౌన్సిల్ సమావేశానికి అధికార, ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు ఎక్కువమంది గైర్హాజరు కావడం గమనార్హం. సమావేశంలో వైస్‌చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, రెండో వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేష్, ఆర్ఐ దిబ్బా రూబెన్, టిపిఒ పి.కనకారావు, ఎఇ జి.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో నేటి నుంచి ప్రాక్టికల్స్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపల్ పి.సూర్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఒకేషనల్ జనరల్ కలిపి 142 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్షల స్థలంలో సిసి కెమెరా కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించామని తెలిపారు.

గజరాజుల గుంపు సంచారం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మి గ్రామ సమీపంలో గజరాజులు గుంపు సంచారం చేయడంతో ప్రజలు భయమందోళనకు గురవుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన జి.రామ్మోహరావు, అలుజు అప్పలనాయుడు చెందిన గజరాజుల గుంపు బోరు బావులను ధ్వంసం చేశాయి. అలాగే ఎస్.దుర్గారావుకు చెందిన ఎకరా మొక్కజొన్న తోట నాశనం చేశాయి.

గులి పద్ధతితో చోడి సాగు మేలు

ప్రజాశక్తి - పాచిపెంట

చోడిపంట సాగును గులి పద్ధతిలో చేస్తే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని కేసలిలో ప్రకృతి సేద్య పద్ధతిలో గులి రాగిని పండిస్తున్న రైతు మీసాల మోహనరావు చోడి పంట క్షేత్రాన్ని పరిశీలించారు. సాంప్రదాయ చోడి సాగు కంటే దాదాపు రెట్టింపు ఉంటాయని, కాకపోతే నారు 12 రోజులు వయసు ఉన్నప్పుడే నాటుకోవాలన్నారు. 40 రోజుల వ్యాధిలో మూడుసార్లు సైకిల్ వీడర్ సహాయంతో కలుపు తీసుకోవాలని, మూడుసార్లు ద్రవ జీవామృతం ఎకరానికి 200 లీటర్ల చొప్పున వేసుకోవాలని సూచించారు. సాధారణంగా రైతులు చోడి పంటను తక్కువ విస్తీర్ణంలో వేస్తారని, దీనికోసం కలుపు నివారణకు కలుపు మందులు వాడకుండా సైకిల్ వీడర్ సహాయంతో నివారణ చేసుకున్నట్లయితే వేరు వ్యవస్థ దగ్గర గాలి బాగా ఆడడం వల్ల భూమి కింద ఉన్న వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందడమే కాకుండా భూమిపై ఉన్న పిలకలకు పోషకాలు బాగా అందడం వల్ల దుబ్బు బాగా చేసి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. తేలికపాటి నేలలకు, సన్న కారు రైతులకు అన్ని పంటల్లో సైకిల్ వీడర్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కలుపు మందులు వేస్తే కలుపుతో పాటు భూమి లోపల కలుపు అవశేషాలు చేరడం వల్ల జీవ వైవిధ్యం దెబ్బతిని కొద్ది సంవత్సరాల్లో భూమి నిస్సారమవుతుందని అన్నారు. కావున రైతులు సాధ్యమైనంత వరకు కలుపు మందులు వాడకుండా ఉండడమే మేలని తెలిపారు. చీడపీడల నివారణకు పేడ మూత్రం, ఇంగువ ద్రావణాన్ని పిచికారీ చేయాల్సిందిగా రైతుకు సూచించారు. అనంతరం చోడి పంటకు కావాల్సిన జీవామృతం తయారీని వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాకేష్ కుమార్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

వీడర్ ద్వారా కలుపు తీసే విధానాన్ని తెలుపుతున్న ఎఒ తిరుపతిరావు

ఉదయం మంచు.... మధ్యాహ్నం తీవ్రమైన ఎండ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణాన్ని శనివారం ఉదయం దట్టమైన పొగ మంచు కమ్మేసింది. ఉదయం 7.30 గంటలు కావస్తున్నా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక హెడ్లైట్లు వేసుకునే పరిస్థితి నెలకొంది. గతవారం రోజులుగా ఉదయం పూట దట్టమైన మంచు కమ్ముకుని చలి వాతావరణం ఉండగా, మధ్యాహ్నం అయ్యేసరికి విపరీతమైన ఎండలు కాస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పొగమంచు వల్ల మామిడి పూతకు తీవ్రమైన నష్టం కలుగుతుందని రైతులు వాపోతున్నారు.

మంచు ప్రభావంతో హెడ్‌లైట్ల వెలుతురులో వస్తున్న వాహనాలు

జూనియర్ సివిల్ జడ్జి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - గజపతినగరం

జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి శనివారం గజపతినగరం పంచాయతీ పరిధిలో దిగువీధిలో ఉన్న బాలసదన్ వసతిగృహం, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో మంచాలు, పరుపులు, తలగడలు అందరికీ సరిపడా ఉన్నట్లు గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశా లలో జగనన్న గోరుముద్ద భోజన పట్టికను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. పిల్లల మూత్ర శాలలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వేసవి దృష్ట్యా మంచినీటి సౌకర్యాన్ని అందుబాటులో ఉంచాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. ఈ తనిఖీలలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

యల్లారమ్మ జాతరకు సర్వం సిద్ధం

నేడు తొలేళ్ల సంబరం ● 200 మందితో పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - జామి

జామి యల్లారమ్మ జాతరకు సర్వం సిద్ధమైంది. గత ఏడాది వరకు కరోనా హెచ్చరికలతో జాతరకు జనం తాకిడి గణనీయంగా తగ్గింది. కానీ ఈసారి 3 లక్షలకు పైగా జనం తరలి వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు వాతావరణం కూడా అనుకూలంగా ఉంది. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటుచేశారు.

ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు

యల్లారమ్మ జాతర విజయనగరం జిల్లాలోనే ప్రసిద్ధి. శివరాత్రి వెళ్లిన మొదటి అష్టమి రోజున జరిగే ఈ జాతరకు ఉత్తరాంధ్ర నుంచే కాక, రెండు తెలుగు రాష్ట్రాలు, ఒడిశా నుంచి కూడా యాత్రికులు వచ్చి, ముడుపులు చెల్లించుకుంటారు. ఎండలు ఉండటంతో చలివేంద్రాలు అత్యధికంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వైద్య శిబిరాలు అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ప్రధాన ఘట్టం నేడే

యల్లారమ్మ జాతరలో ప్రధాన ఘట్టం తొలేళ్ల సంబరం. ఆదివారం రాత్రి అమ్మవారి గద్దె నుంచి పూజారి ఊరేగింపుగా బయలుదేరి, ప్రధాన ఆలయ ప్రవేశం జరుగుతుంది. భారీ జన సందోహం మధ్య ఊరేగింపు ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాలు, పౌరాణిక, డ్యాన్స్ బేబి డ్యాన్సులు నిర్వహిస్తారు. అమ్మవారు ఆలయ ప్రవేశ అనంతరం యాత్రికులు ముడుపులు చెల్లించడానికి బయల్దేరతారు. తెల్లవారు జాము నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు జాతర సాగుతోంది. మంగళవారం చిన్న తీర్థం ఉంటుంది.

పటిష్ట బందోబస్తు

యల్లారమ్మ జాతరకు 200కు పైగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎస్.కోట సిఐ సింహాద్రి నాయుడు, ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో పది మంది వరకు ఎస్ఐలు బందోబస్తు నిర్వహించనున్నారు. ప్రధానంగా దొంగతనాల నివారణతోపాటు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టిపెట్టారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

● పెళ్లయిన ఆరు నెలలకే ఉరేసుకుని ఆత్మహత్య? ●అత్త, మామ, భర్త, ఆడపడుచులపై అనుమానం

మృతి చెందిన ధనలక్ష్మి

రేగిడి : పెళ్లయిన ఆరు నెలలకే అనుమానాస్పదంగా వివాహిత మృతి చెందిన ఘటన ఉంగరాడలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం ఉంగరాడ గ్రామానికి చెందిన గులివిందల ధనలక్ష్మి(21) ఇంట్లో ఉరేసుకుని మృతి చెందింది. ఆమె తండ్రి రౌతు గణపతి రావు పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు.. ఇదే మండలం జోడుబందల గ్రామానికి చెందిన రౌతు గణపతిరావు కుమార్తె ధనలక్ష్మిని ఉంగరాడ గ్రామానికి చెందిన గౌరినాయుడుకు ఆగస్టు 2022న ఇచ్చి వివాహం చేశారు. ఈమె మూడు నెలలు గర్భవతి కూడా. వీరి మధ్య ఇటీవల గొడవలు ప్రారంభమయ్యాయి. ఆమెపై అత్తింటి వేధింపులు కూడా పెరిగాయి. దీంతో ధనలక్ష్మి తన తల్లిదండ్రులకు విషయాన్ని వివరించింది. ఇంతలోనే ఆమె ఆత్మహత్య చేసుకోవడంపై అనుమానాలున్నాయని ఆమె తండ్రి గణపతిరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధనలక్ష్మి తన అత్త లక్ష్మి, మామ సూర్యనారాయ, భర్త గౌరినాయుడుల వేధించి తన కూతుర్ని చంపేశారని ఆరోపిస్తున్నారు. ఇందులో ఆమె ఆడపడుచులు జ్యోతి, యశోదలు పాత్ర కూడా ఉందని చెబుతున్నారు. ఎస్ఐ ఈశ్వరరావు, ఏఎస్ఐ రాజారావు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. శరీరంపై ఉన్న గాయాలను పరిశీలించారు. డిఎస్‌పి బి మోహన్ రావు, సిఐ ఉపేంద్ర సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే అత్త, మామ, భర్త పరారీలో ఉన్న నేపథ్యంలో అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.

నేడు, రేపు వైజ్ఞానిక ప్రదర్శన

బొబ్బిలి : స్థానిక శ్వేతాచలపతి సంస్థానం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం, సోమవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జార్జ్ ఫ్రాన్సిస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. 25 రోబోటెక్ ప్రదర్శనలు, వివిధ వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రదర్శనకు వచ్చే వారు రాజావారి విందు రెస్టారెంట్ ఎదురుగా వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు.